క్లుప్తంగా

కుంభాభిషేకం పూజలు ప్రారంభం

ఏర్పేడు: మండలంలోని సదాశివపురం శ్రీవిజయగణపతి ఆలయంలో శుక్రవారం కుంభాభిషేకంలో భాగంగా ప్రత్యేక పూజలు జరిగాయి. గ్రామస్తులు విరాళాలతో నూతన ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో మూడు రోజుల పాటు కుంభాభిషేక పూజలు నిర్వహించనున్నారు. పూజల్లో భాగంగా మొదటి రోజు ఆలయంలో గణపతి, నవగ్రహ, లక్ష్మి, మూర్తి, దిశ హోమం జరిగింది. అనంతరం నవగ్రహ పూజ నిర్వహించారు. గ్రామస్తులు, వివిధ గ్రామాలకు చెందిన భక్తులు హోమంలో పాల్గొన్నారు.

ఇంటి వద్దే ఓటు ప్రక్రియపై సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఇంటి వద్దే ఓటు వేసే ప్రక్రియపై దివ్యాంగులు, 85 ఏళ్లు నిండిన వారిని గుర్తించడం కోసం బుచ్చినాయుడు కండ్రిగలో శుక్రవారం సెక్టోరియల్ అధికారిణి భారతి, బీఎల్ఓ ప్రసాద్ సర్వే నిర్వహించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఆరోగ్య సురక్షలో మెరుగైన వైద్యం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ చంద్రన్

సత్యవేడు: ఆరోగ్య వైద్యశిబిరాలతో గ్రామాల్లోనే మెరుగైన వైద్యం అందుతోందని దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం సత్యవేడు రెండో సచివాలయంలో రెండో విడత ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ చంద్రన్, కంటి వైద్యనిపుణులు తేజస్వి కలిసి 368 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఎంపీహెచ్ఈఓ సుబ్రమణ్యం, ఈఓపీఆర్డీ రవిమునికుమార్, ఎంఎల్‌హెచ్‌పీ మేఘన, ఫార్మాసిస్టు భార్గవి, ఏఎస్ఎంలు మేరీ, రోస్‌లిన్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి : మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఊరందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి అన్నారు. పాఠశాల ఆవరణలో శుక్రవారం విద్యార్థులతో మొక్కలు నాటించారు. మామిడి, పనస, సపోట, అరటి, కొబ్బరి, జామ, అల్లనేరేడు వంటి పండ్ల మొక్కలను తెప్పించి విరివిగా నాటించారు.

కూటమి అభ్యర్థులను ఓడించండి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి నాగరాజు

శ్రీకాళహస్తి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, ఆ పార్టీ కూటమి అభ్యర్థులను ఓడించాలని సీపీఎం జిల్లా కార్య దర్శి వందవాసి నాగరాజు పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో శుక్రవారం సీపీఎం శ్రీకాళహస్తి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన నాగరాజు మాట్లాడుతూ దేశ సమగ్రతను కాపాడడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ తిరగబడ్డ నాయకులపై ఈడీ, ఈసీ, సీబీఐలను ప్రయోగించి అణగదొక్కే ప్రయత్నం చేయడం దారుణమని విమర్శించారు. ఏపీ విషయంలోనూ తీరని అన్యాయం చేసిన ఎన్డీఏ కూటమితో టీడీపీ, జనసేన జత కట్టడం సిగ్గుచేటు అన్నారు. అనంతరం శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇండియా కూటమి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పోతుగుంట రాజేష్ నాయుడును కార్యకర్తలకు పరిచయం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, పట్టణ బాధ్యుడు గంధం మణి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

సత్యవేడు: ఆస్పత్రుల్లో అగ్నిప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక కమ్యూనిటీ వైద్య సిబ్బందికి అగ్నిమాపక అధికారి పి.రాజయ్య శుక్రవారం అవగాహన కల్పించారు.ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు.మాక్‌డ్రిల్ ద్వారా మంటలు అదుపుచేసే విధానాన్ని డెమో చేసి చూపించారు. ఫైర్‌మన్‌లు రవికుమార్, నరేష్, చంద్రన్ పాల్గొన్నారు.

ప్రజలే నా సైన్యం..



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పక్కన మిద్దెల హరి, అంజూరు శ్రీనివాసులు, నాయకులు

- ఐదేళ్లుగా మీతోనే ఉన్నా..
- మరోసారి ఆశీర్వదించండి
- బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: 'శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే అంటే ఏడాదికి ఒకసారి వచ్చి పోయే పరిస్థితులు ఉండేవని.. గత ఎన్నికల్లో నాకు అవకాశం ఇచ్చిన తర్వాత మీతోనే ఉండే ఎమ్మెల్యేగా పేరు తెచ్చుకున్నాను' అని బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం నామినేషన్ వేస్తున్న సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నామినేషన్ సందర్భంగా శ్రీరాంనగర్ కాలనీ విజయ గణపతి ఆలయం నుంచి ప్రారంభమయ్యే ర్యాలీకి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ప్రజలు, కార్యకర్తలు, నాయకులు, శ్రేయోభిలాషులు తరలిరావాలని కోరారు. అన్ని పార్టీల నాయకులందరూ ఒకటై తనపై యుద్ధం ప్రకటించారని, ప్రజలే తన సైనికులు, ప్రచారాస్త్రాలని తెలిపారు. ఈ యుద్ధంలో గెలవాలంటే పార్టీశ్రేణులు, ప్రజలందరూ తనకు తోడుగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు సేవా కార్యక్రమాలతో ప్రజలను సొంత కుటుంబ సభ్యులుగా భావించే తనను మరోసారి ఆదరించి, అత్యధిక మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

30ఏళ్ల అభివృద్ధి నాలుగున్నరేళ్లలో..

శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 30 ఏళ్లలో ఎన్నడూ ఊహించని రీతిలో నాలుగున్నర ఏళ్లలోనే రూ.కోట్ల నిధులతో అభివృద్ధి పనులను చేసి మధుసూదన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని తెలిపారు. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేసే ఆయనను మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎలాంటి ఆపద వచ్చినా ప్రజలకు మధుసూదన్‌రెడ్డి కుటుంబం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. వరదలు వచ్చినప్పుడు, కరోనా మహమ్మారి విజృంభించినప్పుడు ప్రాణాలను ఫణంగా పెట్టి బియ్యపు మధుసూదన్‌రెడ్డి రూ.కోట్లు వెచ్చించి సేవా కార్యక్రమాలు నిర్వహించారని పేర్కొన్నారు. పలువురు నాయకులు మాట్లాడుతూ సమస్య వచ్చినప్పుడు పారిపోయేవారిని, ఇతర ప్రాంతాల్లో స్థిర నివాసం ఉంటూ చుట్టపు చూపుగా నియోజకవర్గానికి వచ్చే విజిటింగ్ ఆర్టిస్టుకు తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. ముస్లిం కుటుంబాల శుభకార్యాల్లో మేనమామ సాంగ్యంగా ఆత్మ బంధువుగా ఇంటికే కానుకలను పంపే నాయకుడు మధుసూదన్‌రెడ్డి అని తెలిపారు. బియ్యపు మధుసూదన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

టీడీపీ నుంచి భారీగా వైఎస్సార్‌సీపీలోకి..

శ్రీకాళహస్తి మండలం ఓబులాయపల్లెకు చెందిన 40 కుటుంబాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ మండల నాయకుడు జగదీష్ నాయుడు సారథ్యంలో వీరంతా వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు పోలిరెడ్డి, మునిచంద్రారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మురళి, ఆనంద్, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

నేటి నామినేషన్‌కు తరలిరండి

వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా శనివారం బియ్యపు మధుసూదన్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం పట్టణం సమీపంలో కులదైవాన్ని దర్శించుకుంటారు. అనంతరం ఉదయం 9గంటలకు శ్రీరామ నగర్‌కాలనీలోని శ్రీవిజయగణపతి ఆలయం నుంచి పార్టీశ్రేణులతో ర్యాలీగా బయలుదేరుతారు. రామసేతు వంతెన మీదుగా బియ్యపు కృష్టారెడ్డి మండపం, పెండ్లిమండపం, భేరివారి మండపం, గాలిగోపురం, జలవినాయకస్వామి ఆలయం నుంచి వంతెన మీదుగా శ్రీపొన్నాలమ్మ గుడివరకు ర్యాలీ కొనసాగుతుంది. అక్కడ శ్రీపొన్నాలమ్మ దేవత పూజల్లో పాల్గొంటారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ శ్రేణులు, ప్రజలు, అభిమానులు పెద్దఎత్తున ర్యాలీకి తరలివచ్చి తనను మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని కోరారు.

పేదల అభ్యున్నతి జగనన్నతోనే సాధ్యం



రాజేష్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్

నాగలాపురం: పేదల అభ్యున్నతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ అన్నారు. మండలంలోని బైటకొడియంబేడు, నందనం, సుబ్బనాయుడు కండ్రిగ పంచాయతీలలో శుక్రవారం ఉదయం మండల అధ్యక్షుడు అపరంజిరాజు ఆధ్వర్యంలో నూకతోటి రాజేష్ విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనకు అడుగడుగునా గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఈ నాలుగున్నర ఏళ్లలో జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఇంటింటికీ ప్రచార కరపత్రాలను అందించి అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో నియోజకవర్గంలో ప్రజలకు తోడుగా ఎవరున్నారు.. పక్క రాష్ట్రాల్లో ఎవరు దాక్కున్నారో ప్రజలు ఆలోచించాలని కోరారు. జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాలని ఓటర్లను ఆయన అభ్యర్థించారు. జెడ్పీటీసీ సభ్యురాలు సుమతి, సర్పంచ్ చిన్నదొరై సుధ, ఎంపీపీ సింధు, వైస్ ఎంపీపీ కుమారి, మండల జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, జేబీఆర్ మునిరత్నం, ఉప సర్పంచ్ సభ్యురాలు సునీత, జిల్లా జనరల్ సెక్రటరీ జగదీష్ రెడ్డి, నేతలు మహేష్ రెడ్డి, శ్యామ్, పలని, అంకయ్య, హరిబాబు, దేశప్పన్, దేశన్, ఉదయ్‌కుమార్, కులశేఖర్, ధనరాజ్, ఉదయ్, చిరంజీవి, ప్రకాష్, షాబుద్దీన్, రాజామణి పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న నూకతోటి రాజేష్

వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాల సంక్షేమం



కలవగుంట ప్రచారంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

శ్రీకాళహస్తి : అన్ని వర్గాల సంక్షేమం, పారదర్శక పాలన కొనసాగాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవడం ద్వారా జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. మండలంలో పలుగ్రామా ల్లో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. కలువగుంటలో ఆయన మాట్లాడుతూ పార్టీలు, కులాలు, మతాలకతీంగా అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధిని జగనన్న అందించారని తెలిపారు. అలాగే ప్రజలకు అందుబాటులో ఉండే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్



తహసీల్దార్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ బాక్సు

పిచ్చాటూరు: ఎన్నికల్లో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించినట్లు తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మండల ఓటర్లుగా ఉండి వేరే మండలాల్లో, వేరే జిల్లాల్లో ఎన్నికలు విధులు నిర్వర్తించే ఉద్యోగులు ఈ నెల 22లోపు వారి ఎన్నికల విధుల ఆర్డర్ కాపీ, ఆధార్, ఫామ్ 12, ఓటరు కార్డును తమ కార్యాలయానికి అందించాలన్నారు. ఇలా వివరాలు అందించిన ఉద్యోగులకు తహసీల్దార్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అవకాశం కల్పిస్తామని వివరించారు. అవకాశాన్ని ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశన్, సర్వేయర్ కన్నయ్య పాల్గొన్నారు.

సత్యవేడులో మూడు నామినేషన్లు


సత్యవేడు: నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రెండవ రోజు అసెంబ్లీ స్థానానికి మూడు సెట్లు నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ ఆఫీసర్ నరసింహులు తెలిపారు. తెలుగుదేశం పార్టీ తరపున కోనేటి ఆదిమూలం రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. తొలి నామినేషన్‌కు సత్యవేడు మండలానికి చెందిన కే. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రెండో నామినేషన్‌కు బుచ్చినాయుడుకండ్రిగకు చెందిన కే.సతీష్‌నాయుడు ప్రతిపాదించారు. ఇండిపెండెంట్‌గా జెడ్డా రాజశేఖర్ నామినేషన్ దాఖలు చేశారు. రాజశేఖర్ భార్య సుగుణమ్మ, కుమార్తె జేడీ మౌనిక కలిసి నామినేషన్ దాఖలు చేశారు.

శ్రీకాళహస్తిలో ఒకే నామినేషన్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రెండో రోజు శుక్రవారం ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలయ్యింది. నేషనలిస్టు జనశక్తి పార్టీ తరపున శుక్రవారం డాక్టర్ గానుగ పెంట రమేష్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ రవిశంకర్ రెడ్డికి అందజేశారు. సార్వత్రిక ఎన్నికల కోసం గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. గురువారం ఎన్డీఏ కూటమి తరపున టీడీపీ అభ్యర్థిగా బొజ్జల సుధీర్ రెడ్డి రెండు సెట్లు, ఆయన సతీమణి రిషితా రెడ్డి ఒక సెట్, బీసీవై పార్టీకి చెందిన దినత్ బాబు ఒక సెట్ నామినేషన్ వేసిన విషయం తెలిసిందే. మొత్తంగా ఆరు నామినేషన్లు ఇప్పటి వరకు నమోదయినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

గజవాహనంపై అగస్త్యేశ్వరుడు

నారాయణవనం: మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి గజవాహనంపై ఉత్సవర్లు విహరిస్తూ భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. ఉదయం 10.30 గంటలకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం నిత్య పూజాది కైంకర్యాలను అందుకున్న ఉత్సవమూర్తులు సుందరంగా లను సుందరంగా అలంకరించి గజవాహనాన్ని అధిరోహింపజేశారు. తదుపరి పుర వీధుల్లో విహరిస్తూ హారతులను అందుకున్నారు. ఏఈఓ పార్థసారథి, సూపరింటిండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, అర్చకులు రమేష్ గురుకళ్, గౌతం గురుకళ్ పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాలలో ఏడవ రోజు శనివారం సాయంత్రం రథంపై అగస్త్యేశ్వరస్వామి వీధుల్లో విహరించనున్నారు. ఆలయానికి రథం లేనందున సర్వభూపాల వాహన సేవ నిర్వహించనున్నట్లు నాగరాజు తెలిపారు.



గజ వాహనంపై అగస్త్యేశ్వరస్వామి విహారం

వైభవం..రామచంద్రుని వసంతోత్సవం



తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రత్యేకాలంకరణలో ఉత్సవమూర్తులు

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరులో వెలసిన శ్రీసీతా సమేత కోదండరామస్వామి ఆలయంలో నవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వసంతోత్సవం కోలాహలంగా జరిగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వసంతోత్సవంలో భాగంగా శ్రీసీతాలక్ష్మణహనుమత్సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవమూర్తులకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి, సుందరంగా అలంకరించారు. రాత్రి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు నిరంజనాచార్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.

విస్తారంగా చిక్కుడు సాగు



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణిమిట్ట, కనమనంబేడుల్లోని రైతులు చిక్కుడు పంటను విస్తారంగా సాగుచేస్తున్నారు. ఐదు ఎకరాల్లో పంటను వేశారు. ఆరుతడి పంట కావడంతో మెట్టభూముల్లో ఎక్కువగా సాగుచేస్తున్నారు. దీనివలన నీరు ఆదా అవుతుంది. చిక్కుడు కాయలను జబ్బుల నివారణ కోసం మందుల్లో వాడతారని రైతులు తెలిపారు. దీంతో పాటు వాణిజ్య పంట కావడంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడం వలన లాభాలు వస్తుండడంతో రైతులు పంట సాగుపై మక్కువ చూపుతున్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

శ్రీకాళహస్తి : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర అన్నారు. తొట్టంబేడు మండలం బోనుపల్లె, కంచనపల్లె, చిట్టత్తూరు గ్రామాల్లో శుక్రవారం పోలీసులు, ప్రత్యేక బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ అందుకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఎక్కడైనా ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరుగుతాయని భరోసా కల్పించేందుకే కవాతు నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు.



ప్రత్యేక బలగాల కవాతు

అన్నదాతను ఆదుకునే పాలకులు కావాలి



వ్యవసాయాన్ని పండగలా మార్చి రైతుకు భరోసా ఇచ్చేవారే మా నాయకుడు. ఎన్నికల సమయంలో హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక మర్చిపోయే నాయకుల శకం అయిపోయింది. గతంలో వ్యవసాయం దండగ అంటూ కూడు పెట్టే రైతుల కడుపుకొట్టారు. పచ్చని పంటను పండిస్తే నేలమట్టం చేశారు. నష్టపోతే పట్టించుకున్న పాపానపోలేదు. మంచి దిగుబడి ఉంటే ధరల విషయంలో దగా చేశారు. బాగా పండినా, పండకపోయినా రైతులను ఏదోరకంగా అప్పులపాలు చేసి నడిరోడ్డుపై తోసేసిన దళారుల రాజ్యానికి కాలం చెల్లింది. అప్పట్లో ప్రకృతి కూడా సహకరించడం లేదంటే, ఆ నాయకుడి నైజం దేవుడికి ఎరుక. అందుకే గ్రామంలోకి ఎరువులు, విత్తనాలు తెచ్చిచ్చే నాయకులే మాకు కావాలి. వ్యవసాయాన్ని దండగ అన్న కాలం నుంచి వ్యవసాయాన్ని పండుగలా మార్చే నాయకుడిని ఎన్నుకుంటాం. మంచి నాయకుడు వస్తేనే వర్షం సమృద్ధిగా కురుస్తుంది. పంటలు పండుతాయి. రైతులను బతికించే నాయకుడు పాలిస్తే కరువు కాటకాలు కొట్టుకుపోతాయి. అందుకే వ్యవసాయానికి భరోసా ఇచ్చే వారినే గెలిపించుకుంటాం... అంటోంది రైతులోకం.

– సాక్షి నెట్‌వర్క్

రైతు పక్షపాతికే ఓటు..



రైతులకు అండగా ఉంటూ రైతు సంక్షేమాన్ని కోరుకుని, అన్ని సౌకర్యాలు కల్పించే వారికే ఓటు వేస్తాం. ఎన్నికలప్పుడు ఓట్ల కోసం హామీలు ఇచ్చి, తరువాత పట్టించుకోని వారికి ఓటు వేయను. ఉచిత హామీలకు ఆశపడి ఈ ఎన్నికల్లో మోసపోను. వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలిచే వారికి, సాగుకు రుణసౌకర్యం కల్పించి రైతు పక్షపాతిగా నిలిచే వారికే నా ఓటు.

– యచ్చం హరినాథ్‌యాదవ్, అమ్మవారిపట్టెడ(రేణిగుంట)

రైతన్నను ఆదుకున్న వారికే ఓటు



మా కుటుంబానికి 2 ఎకరాల సాగుభూమి ఉంది. గతంలో రైతులను నిర్లక్ష్యం చేయడంతో వరి, వేరుశనగ విత్తనాలు, రాయితీ ఎరువులు కావాలంటే పట్టణ కేంద్రమైన శ్రీకాళహస్తి వెళ్లి తెచ్చుకోవాల్సి వచ్చేది. అవన్నీ ఊర్లోనే అందించే వారికే మద్దతిస్తాం. రైతుకు వెన్నెముకలా నిలిచే వారికే మేము మద్దతు ఇస్తాం.

– రామయ్య, రైతు, పొయ్యకొత్తూరు (తొట్టంబేడు)

సుభిక్షంగా పాలించే వారికే..



కొందరు అధికారంలోకి వస్తే రాష్ట్రంలో వర్షాలు పడక.. పంటలు చేతిక రాక కరువు తాండవిస్తుంది. గతంలో ఇలాంటి కష్టాలు ఎన్నో చూశాను. కొందరు అధికారంలోకి వచ్చిన వెంటనే వరుణుడు కరుణించి వర్షాలు పడి పంటలు పండుతాయి. రైతులు సంతోషంగా ఉంటారు. ప్రతి రైతు కోరుకునేది అలాంటి నాయకున్నే. ఉచిత హామీలు ఇచ్చి మోసం చేసే వారికి కాదు.

– ఓసూరయ్య, రైతు, లింగమనాయుడుపల్లె(తొట్టంబేడు)

రైతు బాగుంటేనే..



రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. రాష్ట్రాన్ని, దేశాన్ని పాలించే ప్రభుత్వాలు రైతు క్షేమం కోరి పథకాలు ప్రవేశపెట్టి, వాటిని సమర్థవంతంగా అమలు చేయాలి. అలాంటి ప్రభుత్వానికి నేను ఓటు వేస్తా. రైతుకు విత్తనం నుంచి ఎరువులతో పాటు పెట్టుబడి సాయం అందించే ప్రభుత్వం రావాలని నేను ఆకాంక్షిస్తున్నాను. నేనే కాదు ప్రతి రైతు ఈ అభిప్రాయంతోనే ఉన్నాడు.

-కృష్ణప్ప మొదలి, రైతు, మోదుగులపాలెం(ఏర్పేడు)

భరోసా ఇచ్చే నాయకుడు కావాలి



రైతులకు ఎన్ని కష్టాలు వచ్చినా నేనున్నాను అని గట్టి భరోసా ఇచ్చే నాయకుడు కావాలి. ఓట్ల కోసం ఉచిత హామీలు ఇచ్చి మొహం చాటేసే వారు నాయకుడు కాదు. రైతే రాజుగా గుర్తించే వారే నిజమైన నాయకుడు. రైతులను పట్టించుకోని వారికి ఓటు వేస్తే రాష్ట్రం అంధకారం అవుతుంది. సాగుకు ముందుగా ఆర్థికసాయం అందించే పాలకులకే ఓటు వేస్తా.

-చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, అంజిమేడు, ఏర్పేడు మండలం

మాయమాటలు చెప్పేవారు వద్దు..



ఓట్ల కోసం మాయమాటలు చెప్పి ఎన్నికల అనంతరం రైతులను పట్టించుకోని నాయకుడికి ప్రాణం పోయినా ఓటు వెయ్యం. పంటలు నష్టపోయిన కాలంలో రైతులకు అండగా నిలిచి అన్నివిధాలా ఆదుకునే నాయకుడే మాకు కావాలి. రైతులను పట్టించుకోని నాయకుడు మరెవరినీ పట్టించుకోడు. కొందరు ఎన్నికలప్పుడు నోటికొచ్చిన హామీలు ఇచ్చి మోసం చేసిన రోజులు చూశాను. –గిరిరెడ్డి, బుచ్చినాయుడుకండ్రిగ